ఈనాడు
నిజామాబాద్
ఆదివారం అక్టోబరు 6, 2024

కల నెరవేరకుండానే.. కడతేరిపోయారు

కుటుంబం బలవన్మరణంతో ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో విషాదం



కుమారుడు హరీష్‌తో సురేష్, హేమలత (పాత చిత్రం)

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లి మండలం వడ్డేపల్లిలో ఓ కుటుంబం బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలిచివేసింది... అందరితో కలివిడిగా ఉండే రంగనవేణి సురేష్(53), హేమలత(45), హరీష్(22) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై వంశీకృష్ణ చేరుకుని విచారణ చేపట్టారు. మృతుల చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సొంతింటి కల సాకారం చేసుకునేందుకు కొన్ని నెలల కిందట సురేష్ దంపతులు ఇంటి పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్, పిల్లర్ల పనులు పూర్తి చేశారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముగ్గురి అంత్యక్రియలు సాయంత్రం గ్రామంలో నిర్వహించారు. హరీష్ స్నేహితులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. అంత్యక్రియలకు గ్రామస్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో 4 రోజులుగా కొనసాగిన డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం ముగిసింది. 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల జాబితా ప్రకటించి, పరిశీలనకు హాజరు కావాలని వారి చరవాణులు, ఈ-మెయిల్‌కు విద్యాశాఖ సంక్షిప్త సమాచారం పంపింది. చివరి రోజు వరకు హాజరుకాని వారికి ఫోన్లో సమాచారమిచ్చామని అధికారులు వెల్లడించారు. శనివారం పరిశీలన కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ రమేశ్ తనిఖీ చేశారు. కౌంటర్ల వారీగా మరోసారి నిర్ధారించుకొని వివరాలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. గైర్హాజరైన వారికి ఫోన్లు చేశామని చెప్పగా విద్యాశాఖ తదుపరి ఆదేశాల మేరకు నడచుకోవాలని సూచించినట్లు డీఈవో పేర్కొన్నారు.



ప్రక్రియ పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు డైరెక్టర్ రమేశ్, డీఈవో

సంప్రదాయ వారధులు 14లో

మధ్యాహ్న భోజన నిధులు విడుదల

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు 2024-25 బకాయిలతో పాటు రెగ్యులర్ బిల్లులు విడుదలైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులకు సంబంధించి రూ.2,21,17,866 వచ్చాయని, మండలాల వారీగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఎంఈవోలు ఆయా ఏజెన్సీల ఖాతాల్లో జమ చేస్తారని వెల్లడించారు.



గుమ్మానికి.. గుమ్మడి ..14లో

రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లాకు చోటు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలు రక్షించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకు నగరంలోనూ హైడ్రా తరహా చట్టం అమలు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ మహిళా డిగ్రీ, ఇంజినీరింగ్, అదనంగా వైద్య కళాశాల, క్రీడా మైదానం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు బోధన్‌లో చక్కెర కర్మాగారం తెరిపించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. నిజామాబాద్ నగరం స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చేలా చూస్తామన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో మరోసారి చర్చిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లా నుంచి కచ్చితంగా ప్రాతినిధ్యం ఉంటుందని చెప్పారు. అధికారంలో ఉన్నది ప్రజా ప్రభుత్వమని, ప్రజల శ్రేయస్సుకు అవసరమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, త్వరలోనే మరిన్ని కార్పొరేషన్ ఛైర్మన్ల పోస్టులు భర్తీ అవుతాయని చెప్పారు. నిజామాబాద్‌లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ఉన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్


స్కానింగ్ చట్టాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: స్కానింగ్ చట్టాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని అదనపు కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో లింగ నిర్ధారణ చట్టాలపై శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎవరైనా పరీక్షలు చేసినట్లు తెలిస్తే అనుమతి రద్దు చేస్తామన్నారు. ఐసీడీఎస్, పోలీసు, వైద్యారోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాలు తనిఖీ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ పాల్గొన్నారు.

అన్నపూర్ణ అవతారం.. పండ్లతో అలంకారం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. జిల్లాకేంద్రం కిషన్‌గంజ్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నాలుగు క్వింటాళ్ల పండ్లతో అమ్మవారిని అలంకరించారు. ఇందుకోసం రూ.50 వేలు వెచ్చించి 15 రకాల పండ్లు కొనుగోలు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

\- న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం









గునుగు పూల కోసం...గిరి పల్లెలకు...



బతుకమ్మ వేడుకల్లో వినియోగించే గునుగు పూలకు పట్టణాల్లో కొరత నెలకొంది. దీంతో బాన్సువాడ, నారాయణఖేడ్, బీర్కూర్, నస్రుల్లాబాద్, కల్హేర్, నిజాంపేట్, బాచేపల్లి, ఎల్లారెడ్డి తదితర ప్రాంతాల నుంచి పలువురు పిట్లం మండలం తండాలు, పెద్దకొడప్‌గల్ మండలం తండా, బుర్గుపల్లి, టికారం తండా, కుబ్యానాయక్ తండా, తలాబ్ తండా తదితర ప్రాంతాలకు వస్తున్నారు. పూలను కోసుకొని ఇలా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు. చిన్నకొడప్‌గల్ సమీపంలో జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా న్యూస్‌టుడే ఈ చిత్రాన్ని క్లిక్‌మనిపించింది. న్యూస్‌టుడే, పిట్లం

సంప్రదాయ వారధులు

'బతుకమ్మ'ను భావి తరాలకు తెలుపుతున్న అతివలు

ఆడపడుచుల ఆత్మీయ నేస్తం బతుకమ్మను చిన్నప్పటి నుంచి కొలుస్తూ.. వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నారు.. పూలతో అమ్మవారిని పేర్చడం.. పసుపుతో గౌరమ్మను పూజించడం.. కుటుంబ బాంధవ్యాలను ప్రతిబింబించే పాటలు పాడుతూ తమ తర్వాతి తరాలకు బతుకమ్మ గొప్పదనాన్ని అందిస్తున్నారు.. కుమార్తెలు, కోడళ్లతో పాటు మనవరాళ్లకు పండగ విశిష్టత తెలియజేస్తూ వారూ ఇందులో భాగస్వాములయ్యేలా చూస్తున్నారు ఈ మహిళలు. న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నాలుగో తరానికి అందిస్తున్నా..

- జిన్న సరస్వతి, కాలూరు, నిజామాబాద్

బతుకమ్మ చేయడం అమ్మ, అమ్మమ్మ నుంచి నేర్చుకున్నా. బొడ్డెమ్మను 15 రోజుల పాటు ఆడేవాళ్లం. బతుకమ్మకు అవసరమైన పూలు కోసుకొచ్చేందుకు ఇప్పటికీ పోటీపడతాం. గ్రామంలో చాలా మందికి బంధుత్వాలు, ప్రేమానురాగాలపై పాటలు నేర్పించా. ఇప్పుడు మా మనవరాళ్లకు సైతం బతుకమ్మ పేర్చడం, ఆటలు ఆడడం, ఊరేగింపులో అమ్మవారిని తలపై మోసేలా చూస్తా. పండగొచ్చిందంటే నాకెంతో సంతోషంగా ఉంటుంది. మా కుటుంబంలో నాలుగో తరం ఈ వేడుకల్లో పాల్గొనేలా చూస్తా.



50 ఏళ్లుగా ఆడుతున్నా

- కరుణ, బోర్గాం(పి), నిజామాబాద్

మాది డొంకేశ్వరం మండల కేంద్రం. మా ఊళ్లో బతుకమ్మ ఘనంగా చేసుకునే వాళ్లం. అమ్మవారి మహిమలను కీర్తిస్తూ పాటలు పాడడం నాకు చాలా ఇష్టం. 50 ఏళ్లుగా అమ్మవారి సేవలో తరిస్తున్నా. మా కూతుళ్ల కోసం ఇక్కడికి వచ్చా. వారితో పాటు మనవరాలు ప్రణవి అన్నిరకాల పూలు తీసుకొచ్చి వాటికి రంగులు వేసి బతుకమ్మను పూజిస్తుంటే నా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి. మనదైన పల్లెసంస్కృతికి ఈ తరం పిల్లలు గౌరవం ఇవ్వడం బాగుంది. ఇది ఇలాగే కొనసాగాలి.



చేతిసంచులతో బతుకమ్మ

- సందగిరి భూదేవి, బోర్గాం(పి), నిజామాబాద్

మాది వ్యవసాయ కుటుంబం. నాకు బతుకమ్మ అంటే ఎంతో ఇష్టం. గతంలో పూలు అడవికి వెళ్లి తెచ్చేవాళ్లం. ఇప్పుడు పూలసేకరణ కష్టమవుతోంది. అందరిలా పూలతో కాకుండా చేతి సంచులతో బతుకమ్మ తయారు చేశా. కూరగాయలు కొన్నప్పుడు ఇచ్చే సంచులను ఇందుకు ఉపయోగించా. మధ్యలో కర్రను ఉంచి చుట్టూ 21 వరసల్లో దారంతో సంచులు కుట్టా. పైన పసుపుగౌరమ్మ ఉంచా. పది రోజుల పాటు కష్టపడి తయారు చేశా. ఇందుకు పైసా ఖర్చు కాలేదు. కాగితపు బతుకమ్మ కంటే ఇది మేలైంది.



జ్వరాల వార్డు పరిశీలన

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రజలకు అందుతున్న ఆరోగ్య సదుపాయాలు పరిశీలించేందుకు జిల్లా ప్రత్యేకాధికారి, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరాల వార్డుతో పాటు ఇతర వార్డులు పరిశీలించారు. రోగులతో ప్రత్యేకంగా మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ రిజిస్టర్, వైద్యులు, సిబ్బంది హాజరును చూశారు. అనతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ప్రత్యేకాధికారికి వివరించారు. సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా వైద్యాధికారి రాజశ్రీ, డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

క్రీడా స్ఫూర్తి చాటాలి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి చాటాలని కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం 69వ తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. తొలి రోజు పూల్-ఏ బాలుర విభాగంలో విజేత నిజామాబాద్, రన్నర్‌గా వరంగల్ జట్లు నిలిచాయి. పూల్-బీలో ఆదిలాబాద్ గెలుపొందగా, రన్నర్‌గా రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో పూల్-ఏలో ఖమ్మం జట్టు విజయం సాధించింది. పూల్-బీలో వరంగల్ విజేతగా, నల్గొండ రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు లోయపల్లి నర్సింగరావు, తెలంగాణ బాల్‌బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, ఉపాధ్యక్షుడు దుర్గయ్య, వీరభద్రరావు, రవీంద్రకుమార్, శ్యామ్, తిరుపతి, నారాయణ రెడ్డి, బయన్న, కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రాజేశ్వర్, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

నాలుగు గేట్లెత్తి.. గోదావరిలోకి వదిలి

శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 27,607 క్యూసెక్కుల వరద చేరుతోంది. పూర్తిస్థాయిలో 80.5 టీఎంసీల నిల్వ ఉండడంతో వచ్చిన వరదను కాల్వలు, వరద గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు 46,486 క్యూసెక్కుల వరద చేరగా 10.30 గంటల వరకు ఎనిమిది వరద గేట్ల ద్వారా 24,992 క్యూసెక్కులు వదిలారు. వరద చేరిక తగ్గడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు గేట్లను మూసివేశారు. సాయంత్రం 27,607 క్యూసెక్కులకు పెరగడంతో తిరిగి నాలుగు గేట్లను ఎత్తి 6248 క్యూసెక్కులు వదులుతున్నారు. కాకతీయ కాల్వ ద్వారా 6800, ఎస్కేప్ గేట్లకు 1200, లక్ష్మి కాల్వకు 150, మిషన్ భగీరథకు 231, వరద కాల్వ ద్వారా 12000, సరస్వతికి 500 క్యూసెక్కులు వదులుతున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీరామసాగర్



జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



సింధూ

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సింధూ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సునీత తెలిపారు. నారాయణపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని బంగారు పతకం సాధించింది. విజేతను .. ప్రిన్సిపల్ సావిత్రి, పీఈటీ గౌరమ్మ, ఉపాధ్యాయులు ప్రమీల, దేవిక, అనురాధ తదితరులు అభినందించారు.

రెజ్లింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం: నారాయణపేట్ జిల్లాలోని ధన్వాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వంగా ఉందని నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. రెండ్రోజుల పాటు జరిగిన పోటీల్లో శనివారం వివిధ విభాగాల్లో పతకాలు సాధించారన్నారు. శిక్షకుడు దేవేందర్, మేనేజర్ సంతోషి ఉన్నారు.

విజేతల వివరాలు: అండర్-17 :
బంగారం: నేహా బేగం, ఎం.సింధు,
వెండి: కోమలి,
కాంస్యం: సుజిత, త్రిష, స్నేహప్రియ

అండర్-14 : **వెండి:** జయశ్రీ,
కాంస్యం: కావేరీ, స్రవంతి



విజేతలతో సంఘం శిక్షకుడు దేవేందర్, మేనేజర్ సంతోషి

ఉషూలో పతకాల పంట

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉషూ క్రీడలో జిల్లా క్రీడాకారిణి పతకాలు సాధించడం గర్వంగా ఉందని తెలంగాణ అమెచూర్ ఉషూ సంఘం కార్యదర్శి అబ్దుల్ ఒమెర్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఈ నెల 1 నుంచి 4 వరకు నిర్వహించిన మొదటి సౌత్ ఏషియన్ స్కూల్ గేమ్స్-2024లో జిల్లా క్రీడాకారిణి ఫరియా ఖానం పాల్గొని జియాన్షు, క్యాంగ్‌షూలో రెండు రజతాలు, చాంగ్‌క్యూయన్‌లో కాంస్యం సాధించారు. నిజామాబాద్‌కు వచ్చిన క్రీడాకారిణికి శనివారం సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

స్తంభం.. ప్రయాణానికి అడ్డం



మోపాల్ మండలం వడ్డెర కాలనీలోని ఓ వీధిలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్తు స్తంభం ఏర్పాటుచేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి పొలాలకు ట్రాక్టర్లలో సామగ్రి తీసుకెళ్లడం, తీసుకురావడం కష్టమవుతోందని పేర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఏఈ బాబా శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. – న్యూస్‌టుడే, మోపాల్



మాట్లాడుతున్న రామకృష్ణ

నూతన చట్టాలపై అవగాహన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త చట్టాలపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్మూర్ కోర్టు సముదాయంలో శనివారం నూతన చట్టాలపై నిర్వహించిన సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాందేష్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరి సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023 గురించి వివరించారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... పోలీసులు కేసుల దర్యాప్తులో చేసే లోపాలు సవరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎస్సైలు రాము, అనిల్, నరేష్, గంగాధర్, కోర్టు లైజెన్ అధికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల పట్టివేత

బాల్కొండ, న్యూస్‌టుడే: ముప్కాల్ శివారులో జూద స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఎనిమిది మందిని పట్టుకున్నట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. వారి నుంచి రూ. 32,550 నగదు, మూడు కార్లు, ఒక ద్విచక్రవాహనంతో పాటు ఎనిమిది చరవాణులు స్వాధీనం చేసినట్లు పేర్కొన్నారు.

నేడు బాల్కొండలో బీసీల మహాసభ

బాల్కొండ, న్యూస్‌టుడే: బీసీల మహా సభ ఆదివారం ఉదయం పది గంటలకు బాల్కొండలో తెలంగాణ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు అబ్బగోని అశోక్ గౌడ్ తెలిపారు. సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ తదితరులు హాజరవుతున్నారని చెప్పారు.

గుమ్మానికి.. గుమ్మడి



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి గుమ్మడి కాయలు సమర్పిస్తారు. తర్వాత అంతా శుభం జరగాలని వాటిని ఇంటి గుమ్మానికి తగిలిస్తారు. ఈ గుమ్మడికాయలు సిద్దిపేట నుంచి పెద్దఎత్తున దిగుమతయ్యాయి. గాంధీగంజ్‌లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు 25 లారీల్లో తెచ్చామని, ఒక్కోటి రూ.50 నుంచి రూ.100కు అమ్ముతున్నట్లు వ్యాపారి చెప్పారు.

– న్యూస్‌టుడే, సుభాష్‌నగర్



టీజీవో జిల్లా అధ్యక్షుడిగా కిషన్

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవో) సంఘం జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్ ఎన్నికయ్యారు. స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో అలుక కిషన్ అధ్యక్షుడిగా, అమృత్ కుమార్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. సమావేశానికి టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న అలుక కిషన్

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

జీజీహెచ్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: 'మహిళా శక్తి' పథకంలో భాగంగా శనివారం జీజీహెచ్ ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ దీనిని ప్రారంభించారు.

నకిలీ ధ్రువపత్రాలపై విచారించాలని వినతి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే : డీఎస్సీ-2024 ధ్రువపత్రాల పరిశీలనలో ఓ మహిళా అభ్యర్థి నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారని, ఆమె ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఎస్సీ అభ్యర్థి మహ్మద్ అన్వర్ సయాద్ శనివారం డీఈవో, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సదరు మహిళ నిజామాబాద్, నిర్మల్, హైదరాబాద్ జిల్లాల్లో నకిలీ ధ్రువపత్రాలతో స్థానిక కోటాలో వ్యాయామ ఉపాధ్యాయురాలి ఉద్యోగం పొందేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: గౌతంనగర్‌లో మురుగు కాలువలు తీయడం లేదు. పూడిక పేరుకుపోయి నీరు నిలిచి దోమ కాటుతో జ్వరాలు వస్తున్నాయి. **- శివకుమార్, స్థానికుడు**

పరిష్కారం: గౌతంనగర్‌కు సోమవారం కార్మికులను పంపించి మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. **- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: గంగాస్థాన్ ఫేస్-2లో పులాంగ్ వాగులో వ్యర్థాలు పారవేయడంతో దుర్వాసన వస్తోంది. ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఉంది. సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. **- నాగరాజు, స్థానికుడు**

పరిష్కారం: వ్యర్థాలు పారవేయకుండా చూస్తాం. ఇప్పటికే కొన్ని దుకాణాలకు నోటీసులు ఇచ్చాం. **- షాదుల్లా, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: వాడి వంతెన వద్ద మట్టి రోడ్డు ప్రమాదకరంగా మారింది. **- రమేష్, స్థానికుడు**

పరిష్కారం: వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. వారం రోజుల్లో రోడ్డును బాగు చేయిస్తాం. **- గంగాధర్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ధర్పల్లి**

సమస్య: గాయత్రినగర్‌లో శివారులో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి? **- బాలరాజు, స్థానికుడు**

సమాధానం: దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, నగర పాలక సంస్థ**

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం, ధర్పల్లి

రూ.లక్షల్లో ఆదాయం.. వసతులు శూన్యం

☛ మేకల అంగడిలో అన్నీ సమస్యలే

న్యూస్‌టుడే, నవీపేట

తెలంగాణాలోనే అతి పెద్ద మేకల అంగడి నవీపేటలో ప్రతి శనివారం నిర్వహిస్తారు. వారానికి 6 వేలకు పైగా జీవాల క్రమవిక్రయాలు జరుగుతాయి. కానీ మార్కెట్ స్థలం గుంతలమయంగా తయారైనా పట్టించుకునే వారు కరవయ్యారు. పేరుకుపోయిన చెత్త, కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన రావడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. తైబజార్ వేలం ద్వారా రూ.లక్షల్లో పంచాయతీకి ఆదాయం వస్తున్నా సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

మహారాష్ట్ర నుంచి..

మహారాష్ట్రలోని ఔరంగాబాద్, జల్నా, ఉమ్రీ, ముథ్‌కేడ్, పర్భణీ, కర్కెల్లి, నాందేడ్, ధర్మాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మేకలు, గొర్రెలను వ్యాపారులు వాహనాల్లో తీసుకువచ్చి ఇక్కడి అంగడిలో విక్రయిస్తారు. హైదరాబాద్, కరీంనగర్, నల్గొండ, వరంగల్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వందల సంఖ్యలో జీవాలను కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ విక్రయిస్తారు.



మురుగు పక్కనే జీవాల విక్రయాలు

సమస్యలు ఇవీ..

☛ వాన నీరు బయటకు వెళ్లేందుకు మురుగుకాల్వల వ్యవస్థ లేదు.

☛ ఇప్పటికీ కొన్ని చోట్ల గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

☛ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి.

☛ వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది.

☛ తాగునీటి వసతి లేదు. వ్యాపారులు నీటి డబ్బాలు కొనాల్సిందే. వేసవిలో మాత్రమే వ్యాపారులు, జీవాలకు రెండు నెలల పాటు నీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

☛ వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో రోడ్ల పక్కన నిలుపుతున్నారు. ☛ అంగడికి వచ్చే వారి వాహనాలు తరచూ చోరీ అవుతున్నా పట్టించునే వారు కరవయ్యారు. ☛ సంతలో ధరల పట్టిక బోర్డులు లేవు. ☛ అధికారుల పర్యవేక్షణ కరవైంది.

ఐదేళ్ల ఆదాయం వివరాలు (రూ.లక్షల్లో)	
ఏడాది	- ఆదాయం
2020-21	- 09.66
2021-22	- 43.12
2022-23	- 33.70
2023-24	- 55.16
2024-25	- 40.51

సౌకర్యాలు కల్పిస్తాం

- రవీంద్రనాయక్, పంచాయతీ కార్యదర్శి, నవీపేట

మేకల అంగడిలో కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం. వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగిస్తూ గుంతలను మొరంతో తరచూ చదును చేయడం జరుగుతోంది. వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటా.



జ్యోతి వెలిగిస్తున్న పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు తదితరులు



నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, శంకర్‌నాయక్ తదితరులు

వెంకటస్వామికి నివాళి

న్యూస్‌టుడే బృందం : కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని శనివారం జిల్లాకేంద్రంతో పాటు వివిధ పట్టణాలు, మండలకేంద్రాల్లో నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రని అందరికీ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.



జిల్లాకేంద్ర గ్రంథాలయంలో..



రుద్రూర్‌లో..

సీఎంసీలో వైద్యకళాశాల ఏర్పాటుకు కృషి

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: సీఎంసీలో వైద్య కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సీఎంసీలో వైద్యుల క్వార్టర్స్‌ను ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. జిల్లాకు మెడికల్, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు రావాలన్నారు. డిచ్‌పల్లి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వగ్రామం రహత్‌నగర్‌లో చర్చి నిర్మాణానికి ఎకరం భూమి విరాళంగా ఇచ్చానని. తనకు అన్ని కులమతాలు సమానమేన్నారు. కొందరు కులమతాల పేరుతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి మాట్లాడుతూ.. తాను సీఎంసీకి గతంలో గెస్ట్ ఫ్యాకల్టీగా వచ్చానని.. సీఎంసీలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటైతే ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు కేశ వేణు, మునిపల్లి సాయారెడ్డి, అమృతాపూర్ గంగాధర్, సీఎంసీ ప్రతినిధులు బిషప్ రుబెన్, పాస్టర్లు పాల్గొన్నారు.



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న పాస్టర్లు

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మాలల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎడ్ల నాగరాజు, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామిదాస్, శంకర్, భూమయ్య, గంగాధర్, పద్మారావు, చిన్నయ్య, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిపార్టుమెంట్ ఎంప్లాయిస్ ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈర్ల రవికుమార్, చంద్రమోహన్ శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానించారు. బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా జిల్లాకు రావడంతో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి భోజన్న, ప్రతినిధులు ఉత్తమ్, నరేశ్, స్రవంతి, సంతోష్, సుదర్శన్, ప్రభాకర్, సంగయ్య పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్ రాక నేడు

ఖలీల్‌వాడి: ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదివారం నగరానికి రానున్నారు. ఖిల్లా రోడ్డులో రాత్రి 8గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

అంతరాయం లేకుండా పనులు పూర్తి

నిజామాబాద్ అర్బన్ : సుభాష్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రంలో మొదటిసారి ఎలాంటి అంతరాయం లేకుండా పనులు చేపట్టినట్లు నగర ఏడీఈ-2 రాజశేఖర్ తెలిపారు. శనివారం పనులు పూర్తయిన సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఈ రవీందర్, డీఈ శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.



కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత



డిచ్‌పల్లిలో..



బోధన్ గ్రామీణం : రాంపూర్‌లో..

చిత్తూ..చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ

జిల్లాలో బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో మహిళలు శనివారం బతుకమ్మను భక్తితో పూజించారు. తీరొక్కపూలతో పేర్చి పాటలు పాడుతూ ఆడారు. అనంతరం నిమజ్జనం చేశారు.

న్యూస్‌టుడే బృందం



నవీపేటలో..



వర్ని: మోస్రాలో..



నగరంలోని స్నేహ సొసైటీలో..

చేనేత హస్తకళా ప్రదర్శన

ఖలీల్‌వాడి : ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను శనివారం నిర్వాహకుడు సంజయ్ జైన్ ప్రారంభించారు. ప్రదర్శనలో బాగల్పూర్, కాంతావర్క్, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, ప్రింటెడ్, లెనిన్ శారీస్, కలంకారీ, బెంగాలికాటన్ వంటి 70కి పైగా చేనేత ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు.



వస్త్రాలు తిలకిస్తున్న మహిళలు



న్యాల్కల్‌రోడ్ లలితాదేవి ఆలయంలో..



వినాయక్‌నగర్‌లో..



కోటగల్లీ మార్కండేయ మందిరంలో..



ఆదర్శనగర్ హింగుళాంబికా దేవి ఆలయంలో..



భవానీపేట్‌లో..



నవీపేట: తడగామలో..

అన్నపూర్ణాదేవి..ఆదుకో తల్లీ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శనివారం అన్నపూర్ణ దేవీగా దర్శనమిచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారికి చండీహోమాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, సామూహికంగా లలితాసహస్రనామ పారాయణాలు చేశారు. ఒడిబియ్యం, వాయినాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



మోపాల్‌లో..



సాలూరలో..



సిరికొండ: న్యావనందిలో..



బోధన్ తట్టికోటలో...



కోటగిరిలో..



ఎడపల్లిలో..



జక్రాన్‌పల్లిలో..

వ్యాసరచన పోటీలు

ఖలీల్‌వాడి : వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా శనివారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు సాయికృష్ణ, గంగారెడ్డి, బీట్ అధికారులు సుధీర్, జయరాజ్, కళాశాల అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి కమిటీకి 27 నామపత్రాలు

బోధన్ : పట్టణాభివృద్ధి కమిటీకి పోటీ నెలకొంది. ఈ నెల 9న నిర్వహించే ఎన్నికలకు శనివారం నామపత్రాలు స్వీకరించారు. అధ్యక్ష స్థానానికి 3, ప్రధాన కార్యదర్శికి 6, కోశాధికారికి 7, ఉపాధ్యక్ష పదవికి5, కార్యదర్శికి 6 నామపత్రాలు దాఖలయ్యాయి.

కబ్జాదారులపై చర్యలకు వినతి

నిజామాబాద్ అర్బన్ : తమ భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మునిపల్లి గ్రామస్థులు కోరారు. నిజామాబాద్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దీనిపై చాలా సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని బాధితుడు రావుట్ల నచ్చన్న పేర్కొన్నారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం

నిజామాబాద్ క్రీడావిభాగం : క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్-2024 క్రీడాపోటీల టార్చ్ రిలే నిర్వహిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఆయన ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు క్రీడాకారులు క్రీడాజ్యోతితో పరిగెత్తారు. అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు హుస్సాముద్దీన్, డీవైఎస్‌వో ముత్తన్న, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, టార్చ్ రిలే జిల్లా సమన్వయకర్త మధు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నగరం : ఖలీల్‌వాడిలో రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముథోల్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా ముథోల్ సమీపంలో ముథోల్, బాసర జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నవీపేట మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన దీపిక, యోగేష్‌లు భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఉన్న బంధువుల దగ్గరకి వెళ్లి తిరిగి కల్యాపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో భైంసా నుంచి బాసర వైపునకు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో దీపిక, యోగేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని క్షతగాత్రులను ముథోల్ దవాఖానాకు తరలించారు. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలను ఠాణాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటికుంటలో పడి ఒకరి మృతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: నీటికుంటలో పడి ఒకరు మృతిచెందిన ఘటన బోధన్ రాకాసిపేట్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సింలు (55) శనివారం కుంట వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి కుంటలోపడి మృతిచెందారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని దవాఖానాకుతరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ..

ధర్పల్లి : గుడితండాకు చెందిన నాందేవ్ (47) గుల్ఫారం కల్లుకు బానిసై శుక్రవారం పురుగుల మందు తాగారు. రాత్రి జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జగదేవపూర్ : మునిగడపలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. నిజామాబాద్‌కు చెందిన బాలమణి(48) అనారోగ్యంతో బాధపడుతూ తన తల్లిగారి ఊరైన జగదేవపూర్ మండలం మునిగడపకు 4 నెలల కిందట వచ్చారు. ఆమెకు హైదరాబాద్‌లో చికిత్స అందించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురై శుక్రవారం తన తల్లికి చెందిన పొలం వద్ద విషద్రావకం తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను సిద్దిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మిల్లులో పనిచేస్తుండగా యువకుడు..

బోధన్ గ్రామీణం : సాలూరలోని తిరుమల రైస్‌మిల్లులో శనివారం రేకుల షెడ్డు వేస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఓ యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌మాధవ్(24) మిల్లులో రేకుల షెడ్డు నిర్మాణానికి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, 9నెలల కూతురు ఉన్నారు. పని వద్ద నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తన భర్త మృతిచెందినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఏఎస్సై రవీందర్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం

నవీపేట, న్యూస్‌టుడే: అప్పు ఇచ్చిన వ్యక్తి తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడనే ఆరోపణతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడారు. ఎస్సై వినయ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేట మండలం ధర్మారానికి చెందిన కొండయ్య ప్రవీణ్‌గౌడ్(33)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అదే గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తి సదరు ప్రవీణ్‌గౌడ్ ఇంటి నిర్మాణానికి రూ.50వేల విలువైన సామగ్రిని మూడేళ్ల కిందట అప్పు రూపంలో ఇచ్చారు. అప్పు తీర్చాలంటూ నర్సయ్య పలుమార్లు బాధితుడి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. గొడవల కారణంగా ప్రవీణ్ భార్య పిల్లలతో కలిసి ఇటీవల పుట్టింటికి వెళ్లింది. అప్పు ఇచ్చిన వ్యక్తి బెదిరింపులకు పాల్పడటంతో బాధలు తట్టుకోలేక పురుగుల మందు తాగి చనిపోతున్నట్లు ప్రవీణ్ ఉత్తరం రాసి శుక్రవారం రాత్రి ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు, గ్రామ పెద్దలు తన కుటుంబానికి న్యాయం చేయాలని లేఖలో పేర్కొన్నారు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించగా దవాఖానాలో చికిత్స పొందుతున్నారు. సోదరుడి ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం : ద్విచక్రవాహనాల దొంగలను పట్టుకున్న ఘటన నగరంలోని రెండో ఠాణా పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తాలో సీసీఎస్, రెండో ఠాణా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి వివరాలు తెలుసుకోగా నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన నీల నర్సింహ(28), ఫెరోజ్‌ఖాన్(24)గా గుర్తించారు. వారు నడుపుతున్న ద్విచక్రవాహనం పత్రాలు లేకపోవడంతో అనుమానం వచ్చి వివరాలు అడగగా తీసుకొచ్చిన వాహనం చోరీ చేసిందని నిర్ధారించారు. మరింత లోతుగా విచారించి నగరంలోని పలు ఠాణాల పరిధిలో వీరు దొంగిలించిన ఐదు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపారు.

ఆటో చోరీ

ఎడపల్లి, న్యూస్‌టుడే: కుర్నాపల్లిలో ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఆటో శుక్రవారం రాత్రి చోరీకి గురైందని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. దుండగులు ఆటోను ఎత్తుకెళ్లారన్నారు. శనివారం ఉదయం చూసే సరికి వాహనం కనిపించకపోవడంతో బాధితుడు షేక్ కరీం ఠాణాలో ఫిర్యాదు చేశారని, ఆ మేరకు విచారణ ప్రారంభించినట్లు ఎస్సై వివరించారు.

నియంత్రికల ధ్వంసం

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలం కొండూరులోని ఎత్తిపోతల పథకం ఆవరణలోని రెండు నియంత్రికలను దుండగులు గురువారం ధ్వంసం చేసి అందులోని ఆయిల్, రాగి తీగలను చోరీ చేశారు. గ్రామస్థులు, రైతులు రూరల్ ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఠాణా ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరీఫ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డీడీవోపీ లక్ష్మీనర్సయ్య

నూతన చట్టాలపై న్యాయ సలహాలు

నిజామాబాద్ న్యాయవిభాగం: నిజామాబాద్ డివిజన్ పోలీసు అధికారులు, కోర్టు రైటర్లకు, కోర్టు పోలీసులకు డీడీవోపీ లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో ప్రాసిక్యూటర్లు భారతీయ నూతన చట్టాలపై న్యాయ సలహాలు ఇచ్చారు. తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ వైజయంతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డీడీవోపీ తెలిపారు. ఓపీపీలు రహిముద్దీన్, రాజేశ్‌గౌడ్‌లు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.

బోధన్ : బోధన్ డివిజన్‌లోని పోలీసు అధికారులకు నూతన న్యాయ చట్టాలపై శనివారం కోర్టు ఆవరణలో అవగాహన కల్పించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు భారతీయ సాక్ష్య అధినియం-2023పై, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి భారతీయ న్యాయ సంహిత, నాగరిక సురక్ష సంహిత-2023పై శిక్షణ ఇచ్చారు. ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వెంకటనారాయణ, విజయ్‌బాబు, జయేష్‌రెడ్డి, ఎస్సైలు, అటవీ, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



బోధన్: పోలీసు అధికారులతో ఏపీపీలు

ఒకరిపై దాడి ఆరుగురిపై కేసు

నిజామాబాద్ నేరవిభాగం : ఒకటో ఠాణా పరిధిలో పాతకక్షలు మనసులో పెట్టుకుని ఒకరిపై దాడి చేయడంతో ఆరుగురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన మజహర్‌ఖాన్ శనివారం బోధన్ రోడ్డులోని ఓ హోటల్‌లో భోజనం చేస్తుండగా అఫ్సర్, సిద్ధిఖ్ తన స్నేహితులు ముజీబ్, మజహద్, అద్నాన్, ఇద్రీస్‌లతో కలిసి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాల మధ్య గతంలో పీడీఎస్ బియ్యానికి సంబంధించిన గొడవలున్నట్లు పోలీసులు గుర్తించారు. దాడికి కారణమైన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి

నిజామాబాద్ నేరవిభాగం : నాలుగో ఠాణా పరిధిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి జరిగిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిఖిల్‌సాయి చౌరస్తాలో ఓ మహిళను బస్సు ఢీకొట్టిందని, ఆమె కుటుంబ సభ్యులతో కలిసి బస్సులోని డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేయడంతో పాటు బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఆర్మూర్
• ఆర్మూర్ • బాల్కొండ



అయ్యప్పస్వామి మాసోత్సవాలు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ అయ్యప్ప మందరంలో స్వామి వార్షిక మాసోత్సవాలు శనివారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు మెట్ల పూజ, దీపారాధన చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణ దేవాంగ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి హాజరై కార్యవర్గసభ్యులను అభినందించారు. అధ్యక్షుడిగా కొంగి రాము, కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. శ్రీనివాస్, పండిత్ పవన్, కౌన్సిలర్ ప్రసాద్, సత్యనారాయణ, మాజీ సర్పంచి కొంగి సదాశివ్, మనోహర్, వినయక్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని పాతూర్‌లో మురుగు కాలువ శుభ్రం చేయడం లేదు. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. **-ప్రశాంత్, నందిపేట్**

సమాధానం: కాలువను శుభ్రం చేయిస్తాం. ప్రజలు కూడా పరిశుభ్రతకు సహకరించాలి.

-లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్

మాక్లూర్ గ్రామీణం: చిన్నాపూర్ గ్రామ శివారులో వీధి దీపాలు వెలగడం లేదు.

-నారాయణ

సమాధానం: పనిచేయని వీధి దీపాలు తొలగించి వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తాం.

-శ్రీనివాస్, ఎంపీవో

మాక్లూర్ గ్రామీణం: దాస్‌నగర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగాయి. రోడ్డు చిన్నగా మారింది. వాటిని తొలగించాలి.

-రాజేష్, దాస్‌నగర్

సమాధానం: పిచ్చి మొక్కలను బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగిస్తాం.

- గులాబ్, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆర్మూర్ గ్రామీణం: పట్టణంలోని విద్యానగర్‌లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- మోహన్**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం.

- గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్ గ్రామీణం: రాజారాంనగర్‌లో మురుగు కాల్వలో చెత్త పేరుకుపోయింది. శుభ్రం చేయించండి. **- రాజేందర్**

సమాధానం: సిబ్బందిని పంపించి చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- గజానంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మురుగు కాలువ శుభ్రం



గుత్ప(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: గుత్ప గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం లేక దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీవో శ్రీనివాస్ స్పందించి.. పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించారు.

మంచినీటి సహాయకులొస్తున్నారు!

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి




కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌లోని చేతిపంపు. మరమ్మతులు లేక నిరుపయోగంగా ఉంటుంది. పంచాయతీ వాటర్‌మెన్లకు బాగు చేసే నైపుణ్యం లేదు. ఉపయోగంలో లేకుండా పోయింది. ఇక కొత్తగా వచ్చే మంచినీటి సహాయకులు బాగు చేస్తారు.

ఇవి కేవలం ఈ రెండు గ్రామాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఆర్మూర్ డివిజన్‌లోని 186 గ్రామాల్లో ఈ సమస్య ఉంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపడానికి మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా విభాగం కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీ పరిధిలో ఒకరు లేదా ఇద్దరు మంచినీటి సహాయకుల(వాటర్‌మెకానిక్‌లు)ను నియమించాలి. వారితో మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. దీని కోసం ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 270 మందిని ఎంపిక చేశారు. ఇప్పటికే మాక్లూర్, బాల్కొండ, భీమ్‌గల్ మండలాల్లో శిక్షణ ఇచ్చారు. మిగతా మండలాల వారికి త్వరలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. పూర్తి స్థాయి మంచినీటి సహాయకులుగా మార్చుతారు. శిక్షణ తర్వాత ధ్రువీకరణ పత్రాలూ అందిస్తున్నారు.

☛ ఆర్మూర్ డివిజన్‌లో 270 మంది ఎంపిక

☛ నైపుణ్య శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రాల అందజేత



ఇది కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ పంచాయతీ పరిధిలోని దమ్మన్నపేట వద్ద పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ. పంచాయతీ సిబ్బందికి పైపును తొలగించి కొత్త పైపు బిగించే నైపుణ్యం లేదు. మెకానిక్ వచ్చి మరమ్మతులు చేసేంతవరకు లీకేజీ సమస్య పరిష్కారం కాదు.

నాకు అవకాశం కల్పించారు: గంగపోచయ్య, కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి పంచాయతీలో కొన్నేళ్లుగా వాటర్‌మెన్‌గా పని చేస్తున్నా. పైపులకు లీకేజీలు ఏర్పడితే మెకానిక్ వచ్చి మరమ్మతులు చేస్తాడు. కానీ ఇప్పుడు మాకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ఎంపిక చేశారు. త్వరలో ఇవ్వనున్నారు.

శిక్షణకు వెళ్తాను

శ్రీకాంత్, తొర్తి



తొర్తి పంచాయతీలో వాటర్‌మెన్ మెకానిక్‌గా పని చేయడానికి శిక్షణకు పంపిస్తున్నారు. శిక్షణ తర్వాత మెకానిక్‌గా పని చేయడానికి ధ్రువీకరణ పత్రం ఇస్తామని చెప్పారు. అందుకే శిక్షణకు వెళుతున్నాను.

నేర్పే అంశాలు

☛ నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు గుర్తించడం, వాటిని బాగు చేసి ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు విడి భాగాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు.

☛ బోరు మోటార్ల పనితీరుపై అవగాహన, స్టార్టర్, ఫీజు పోతే మరమ్మతులు చేయడం

☛ లీకేజీ పైపులను తొలగించడం, కొత్తవి ఏర్పాటు చేయడం. పగిలిన పైపులను అతికించడంపై శిక్షణ ఇస్తున్నారు.

గౌడ సంఘం ఎన్నిక



వెల్మల్ గౌడ సంఘంకు ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నందిపేట్ గ్రామీణం: వెల్మల్ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా కోటజాన్, కోశాధికారిగా నవీన్‌గౌడ్, సలహాదారుడిగా శ్రీనివాస్‌గౌడ్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కొత్త కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు.

పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ తమ పేరు నమోదు చేసుకోవాలని ఓయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారాంయాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సిద్ధార్థ కాలేజీలో శనివారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. టీ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, లింగం, సీవీఆర్ కళాశాల కార్యదర్శి గిరిరాజ్, ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్, సిద్ధార్థ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నవీన్, న్యాయవాది శ్యాం, రాజేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్మూర్ పట్టణ భాజపా కన్వీనర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని న్యాయవాది లోక భూపతిరెడ్డి ప్రారంభించారు. గంగారాం, అనిల్‌కుమార్, వేణు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ప్రసంగిస్తున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కోరుకుంటుందని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోయా పంటను కొనుగోలు చేయడం లేదని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇప్పటికే కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గుర్తు చేశారు. గత భారాస ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోలేదని విమర్శించారు.

సర్కారు దవాఖానాల్లో మెరుగైన వైద్యం

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం లభిస్తుందని కమిషనర్ ఆఫ్ వైద్య విధాన పరిషత్తు డాక్టర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడి సౌకర్యాలు, వైద్యుల సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ అవసరమైన సౌకర్యాలు, వైద్య పరికరాలు, ఇతర అంశాలపై పరిశీలించేందుకు వచ్చామని అన్నారు. ఆయనతో పాటు డాక్టర్లు శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

గల్ఫ్ సమస్యలపై గళమెత్తండి

ఆర్మూర్, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశాల్లో కార్మికులు పడుతున్న ఇబ్బందులు తీర్చాలని బహ్రెయిన్‌లోని సంక్షేమ సంఘం నాయకులు శనివారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసి విన్నవించారు. అక్కడ జరుగుతున్న నవభారత్, ఓనమ్ పండగ వేడుకల కోసం వచ్చిన ఆయన్ను ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏ సమస్య వచ్చినా ముందుంటానని, అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో నాయకులు తోట రమేశ్‌పటేల్, నవీన్‌కుమార్, కిషన్, లక్ష్మణ్, శ్రీనివాస్, ఎర్రం సుమన్ ఉన్నారు.



కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కలిసిన గల్ఫ్ సంఘాల నాయకులు

బతుకమ్మ సంబురాలు



విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో..



ఇజ్రాయెల్‌లో..

మానిక్‌బండార్(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: మానిక్‌బండార్ సమీపంలోని విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అధ్యాపకులు, విద్యార్థినులు వివిధ పూలతో బతుకమ్మలు పేర్చారు. పాటలు పాడుతూ.. వాటి చుట్టూ తిరుగుతూ ఆడారు. కళాశాల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ శమంతరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ గణేష్, సురేష్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ సిద్ధార్థ కాలేజీలో..



చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో..

నందిపేట్: డొంకేశ్వర్ పీహెచ్‌సీలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వైద్యుడు విద్యాసాగర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండలోని నవీన్ విద్యానికేతన్, కృష్ణవేణి ఉన్నత పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి ఆడారు. బతుకమ్మలను తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.



బాల్కొండ నవీన్ విద్యానికేతన్‌లో..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ప్రభుత్వ, శ్రీభాషిత జూనియర్ కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పూలు తెచ్చి పేర్చి బతుకమ్మలు తయారు చేశారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు చిరంజీవి, రాజశేఖర్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండ కృష్ణవేణి హైస్కూల్‌లో..



కమ్మర్‌పల్లి శ్రీభాషిత జూనియర్ కళాశాలలో..

ఆర్మూర్ గ్రామీణం: ఇజ్రాయెల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సోమ రవి, ప్రధాన కార్యదర్శి వివేక్ ముంబై, కోశాధికారి సాయికుమార్, కుంట శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌రెడ్డి, మల్లెల గంగాధర్, యాదగిరి, ఐరావత్రి నర్సయ్య, నవీన్ పాల్గొన్నారు.



డొంకేశ్వర్ పీహెచ్‌సీలో..

భోజన విరామ సమయంలో నిరసన



పోచంపాడ్(బాల్కొండ), న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు వద్ద గల జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు భోజన విరామ సమయంలో శనివారం నిరసన తెలిపారు. రామగుండంలో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కేంద్రం నిర్వహణ బాధ్యతను జెన్‌కో ఒక్క సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఐకాస నాయకులు రఫీక్, సతీష్, భరత్, డీఈ శ్రీనివాస్, శ్రీకాంత్, వేణుగోపాల్, గంగాధర్, నితిన్‌సింగ్, మోహన్, ప్రవీణ్, నిదీష్, మంజుల, శృతిమ, గ్రీష్మ, మేఘన, నవనీత, సింధూజ, వినోద్, ప్రభాకర్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

బోనస్‌తో సోయా కొనుగోలు చేయాలి

వేల్పూర్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: సోయాబీన్‌ను రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో భారాస నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి పంటకు బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పడం అన్యాయమన్నారు. ఏలియా, జైడి నాగేందర్, మెతె బాల్‌రాజ్, రాజేశ్వర్, రేగుల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



పోచంపాడ్‌లో గాయత్రి దేవి అలంకరణలో దేవికి పూజలు

మెండోరా, బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ, మెండోరా మండలాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేవి దీక్షా భక్తులతో పాటు భక్తులు ప్రతి రోజు మండపాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పోచంపాడ్‌లో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. బాల్కొండ ఎన్‌టీఆర్ కాలనీలో పూజలు జరిగాయి.



కిసాన్‌నగర్‌లో..



పోచంపాడ్‌లో మండపం



బాల్కొండ ఎన్‌టీఆర్ కాలనీలో దుర్గాదేవి..

కిసాన్‌నగర్(బాల్కొండ): కిసాన్‌నగర్‌లో వీరా యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మోర్తాడ్, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్రీడల్లో రాణించాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో జరిగిన కరాటే బెల్ట్ ఎగ్జామినేషన్ ట్రైనింగ్‌లో మోర్తాడ్‌కు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన క్రీడాకారులకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు బెల్ట్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఏర్గట్ల(కమ్మర్‌పల్లి): ఏర్గట్లకు చెందిన నూనె శ్రీనిధి కరాటేలో బ్లాక్‌బెల్ట్‌ను సాధించింది. మెట్‌పల్లిలో జరిగిన పోటీల్లో ప్రతిభతో బ్లాక్‌బెల్ట్‌కు ఎంపికైంది. మెట్‌పల్లి ఏసీపీ ఉమామహేశ్వరరావు బ్లాక్‌బెల్ట్‌ను ప్రదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం



భీమ్‌గల్ గ్రామీణం: పల్లికొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అవీ...ఇవీ.. అన్నీ

ఉపాధ్యాయులకు సన్మానం

ఆర్మూర్ గ్రామీణం: ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రమేష్, నాగరాజు, స్రుపన్, సౌమ్య, నిఖిల, శిరీష, లిఖిత, గంగామణి, పద్మలను సన్మానించారు. పాఠశాల పాలనాధికారిణి పేర్కొన్నారు.

పాన్‌షాప్ దగ్ధం

ఆర్మూర్ గ్రామీణం: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ పాన్‌షాప్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. రూ. లక్షన్నర ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు సతీష్ తెలిపారు.

వెంకటస్వామి జయంతి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో దివంగత ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో రాజశ్రీనివాసు, ఏపీవో సదాశివ్, పీవో విద్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడ్(బాల్కొండ): శ్రీరామసాగర్ ప్రాజెక్టులోని జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రంలో మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెన్‌కో ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

భాజపా నాయకుడికి పరామర్శ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భాజపా నాయకులు చింత గణేష్ మృతి చెందగా, కుటుంబ సభ్యులను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటీ మల్లికార్జున్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. చింత ప్రవీణ్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల అందజేత

ఆర్మూర్ గ్రామీణం: ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకుడు అయ్యప్ప శ్రీనివాస్ శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బాల్కొండ: బోదేపల్లిలో మల్లయ్య ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ రూ.ఐదు వేలు సాయంగా పంపించారు. నగదును మల్లయ్య శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

డ్రైవర్‌కు రిమాండ్

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ వద్ద బైక్‌ను హార్వెస్టర్ ఢీకొట్టడంతో చింత గణేష్ మృతి చెందిన కేసులో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన హార్వెస్టర్ డ్రైవర్ అగు కిరణ్‌కుమార్‌దాస్‌పై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

శిశువు మృతితో బంధువుల ఆందోళన

ఆర్మూర్ గ్రామీణం: గర్భస్థ శిశువు మృతి చెందిన సంఘటనపై ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం బంధువులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... సిరికొండ మండలం రూప్లాతాండాకు చెందిన బానవత్ మంజుల రెండో కాన్పు కోసం ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో చేరారు. 9 నెలలు పడటంతో ఓ ప్రైవేటు కేంద్రంలో స్కానింగ్ చేయించుకొని రిపోర్టును వైద్యాధికారిణికి చూయించారు. గుండెచప్పుడు తక్కువగా ఉందని ఆసుపత్రి వైద్యురాలు తెలిపినట్లు బాధితులు వాపోయారు. శనివారం మంజుల ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆమెను భీమ్‌గల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి మూడు రోజుల కిందటే గర్భస్థ శిశువు మృతి చెందినట్లుగా నిర్ధారించారని బంధువులు వివరించారు. దీంతో బాధితులు ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వైద్యురాలిని నిలదీశారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పడగా వైద్యులు బాధితులను సముదాయించారు.